



# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 308 | వరంగల్ | శనివారం, 12 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06


# ప్రైవేటు వాహనాలకు పోలీసు స్టిక్కర్లు.. సైరన్లు..!

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో యథేచ్ఛగా వినియోగం

నంబర్ ప్లేట్ లేని వాహనంలో సైరన్

పోలీసులను చూసి సమాధానం చెప్పకుండానే పరారీ

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

3




పోలీసు శాఖకు చెందిన వాహనాల మాదిరిగా ప్రైవేటు వాహనాలకు పోలీసు స్టిక్కర్లు అతికించుకుని, సైరన్లు సైతం ఏర్పాటు చేసుకుని దర్జాగా తిరుగుతున్న వాహనాలు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసు విధుల్లో ఉపయోగించే గుర్తింపులను సాధారణ వ్యక్తులు తమ వ్యక్తిగత వాహనాలకు వినియోగించడం పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పోలీసు స్టిక్కర్‌తో ఉన్న ఓ బొలెరో వాహనంతో పాటు మరో కారులోనూ పోలీసు అని రాసి ఉన్న స్టిక్కర్ కనిపించినట్లు సమాచారం. మరోవైపు సైరన్ ఏర్పాటు చేసిన ఓ వాహనానికి కనీసం నంబర్ ప్లేట్ కూడా లేకపోవడం మరింత అనుమానాలకు తావిచ్చింది. *- అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్*

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

**నిర్వాహకులు నిబంధనలు పాటించాలి.. భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్**

జిల్లాలో గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

*- అక్షరశక్తి, భూపాలపల్లి*

2



## గణేశ్ ఉత్సవాలపై నిత్యం నిఘా

- మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- నిమజ్జనానికి చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటుకు సీఎం ఆదేశం



మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం సమీక్షించారు. *- అక్షరశక్తి, హైదరాబాద్*

5



## పెన్షన్ దరఖాస్తుల అర్హత పరిశీలన



**అక్షరశక్తి,రాయపర్తి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల అర్హత పరిశీలన కార్యక్రమం శుక్ర వారం నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) కూచన ప్రకాష్ గ్రామానికి విచ్చేసి పెన్షన్ కోసం అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఎంపీఓ ప్రకాష్ తెలిపారు. దరఖాస్తుదారుల అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారికి పెన్షన్ అందేలా ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న సంతోష్ కందికట్ల, వార్డు సభ్యులు చిర్రా నాగరాజు, దొమ్మటి లలిత రమేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్

**పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచన**





**అక్షరశక్తి,వరంగల్:** మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కొండా సురేఖతో కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ సమావేశాలకు కొండా సురేఖ హాజరు కాకపోవడం తదితర అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండకుండా యాక్టివ్‌గా వ్యవహరించాలని మీనాక్షి నటరాజన్ కొండా సురేఖకు సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించినట్లు తెలుస్తోంది. మీనాక్షి నటరాజన్‌తో ఫోన్ సంభాషణ నేపథ్యంలో కొండా సురేఖ నేడు అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా? లేదా? అన్న అంశంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆమె తదుపరి రాజకీయ కార్యాచరణపై కూడా పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

## మట్టి వినాయకుడినే పూజిద్దాం



**అక్షరశక్తి, హన్మకొండ:** వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని తెలంగాణ రక్షణ సేన సీనియర్ లీడర్ బండారి సుమన్ పటేల్ పిలుపునిచ్చారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణం, నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. పండుగల ఆనందంతోపాటు ప్రకృతి పరిరక్షణను కూడా బాధ్యతగా భావించాలని సూచించారు. “మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దాం” అని పిలుపునిచ్చారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

- నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్




**అక్షరశక్తి, భూపాలపల్లి:** జిల్లాలో గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు పోలీస్ క్లియరెన్స్ కోసం పూర్తిగా నింపిన ఇంటిమేషన్ ఫారాన్ని తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతిష్ఠాపన స్థలం, తేదీతోపాటు నిమజ్జన ఊరేగింపు తేదీ, సమయం, మార్గం, నిమజ్జన ప్రదేశం వివరాలను అందులో పేర్కొనాలన్నారు. స్థల యజమాని నుంచి ఎన్‌ఓసీ పొందడం తప్పనిసరని తెలిపారు. ట్రాఫిక్‌కు, ప్రజా శాంతిభద్రతలకు ఇబ్బంది కలగని ప్రాంతాల్లోనే విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల్లో అనధికారిక విద్యుత్ కనెక్షన్లు వినియోగించరాదని, అధికారిక విద్యుత్ కనెక్షన్ పొందాలని పేర్కొన్నారు. లౌడ్‌స్పీకర్లను రెండు బాక్స్ టైప్ స్పీకర్లకు పరిమితం చేయాలని, డీజేలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధమని తెలిపారు. ప్రతి మండపంలో సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు. అసభ్యకర నృత్యాలు, అభ్యంతరకర పాటలు, కార్యక్రమాలకు తావివ్వకుండా భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ప్రతి మండపంలో సైబర్ అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, ఓటీపీలు, పిన్‌లు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోకపోవడం, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు, స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, శాంతి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# ఓటర్ల అభ్యంతరాలు, పరిశీలించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**అక్షరశక్తి వరంగల్:** ఎస్ఐఆర్-2026లో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ కాంపెయిన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పరిశీలించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కాంపెయిన్‌లో భాగంగా శనివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న స్పెషల్ క్యాంపెయిన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, ఓటర్ల నుంచి ఫామ్ 6,7,8 దరఖాస్తుల ప్రక్రియను మరియు ఎస్ ఐ ఆర్ లో భాగంగా నోటీస్ డిస్ట్రిబ్యూషన్ విధానం, సంబంధిత పత్రాల పరిశీలన, రికార్డుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. కొత్తవాడ ఆటోనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు శివనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల మరియు మామునూర్ లోని 166, 167,168 పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంపెయిన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో హాజరైన ఓటర్ల వివరాలు, వారి నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి వచ్చే ప్రతి అభ్యంతరం, దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలపై వచ్చే అభ్యంతరాలను కూడా నిర్దేశిత ఫాం 6,7,8 లలో నమోదు చేయాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రక్రియపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. సర్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో వరంగల్ ఆర్డీవో సుమ, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఆర్డీవో కార్యాలయం dao ఫణికుమార్ సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

**అక్షరశక్తి, వరంగల్ వెస్ట్:** మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పిలుపునిచ్చారు. ‘మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుదాం’ అనే నినాదంతో వాలంటీర్లు స్వయంగా మట్టి విగ్రహాలను తయారు చేసి పలువురికి అందించారు. అనంతరం కళాశాల నుంచి హంటర్ రోడ్‌లోని భద్రకాళి బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులు, ప్రజలకు మట్టి విగ్రహాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, సింథటిక్ రంగులతో తయారయ్యే విగ్రహాలు పర్యావరణానికి హానికరమని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీలత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రకృతికి ప్రతి ఒక్కరూ మేలు చేయాలని, అప్పుడే ప్రకృతి మనలను కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమ వేముల, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



Telugu Trending News

# ప్రైవేటు వాహనాలకు పోలీసు స్టిక్కర్లు..సైరన్లు..!

- వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో యథేచ్ఛగా వినియోగం
- నంబర్ ప్లేట్ లేని వాహనంలో సైరన్
- పోలీసులను చూసి సమాధానం చెప్పకుండానే పరారీ
- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి




**అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్:** పోలీసు శాఖకు చెందిన వాహనాల మాదిరిగా ప్రైవేటు వాహనాలకు పోలీసు స్టిక్కర్లు అతికించుకుని, సైరన్లు సైతం ఏర్పాటు చేసుకుని దర్జాగా తిరుగుతున్న వాహనాలు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసు విధుల్లో ఉపయోగించే గుర్తింపులను సాధారణ వ్యక్తులు తమ వ్యక్తిగత వాహనాలకు వినియోగించడం పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పోలీసు స్టిక్కర్‌తో ఉన్న ఓ బొలెరో వాహనంతో పాటు మరో కారులోనూ పోలీసు అని రాసి ఉన్న స్టిక్కర్ కనిపించినట్లు సమాచారం. మరోవైపు సైరన్ ఏర్పాటు చేసిన ఓ వాహనానికి కనీసం నంబర్ ప్లేట్ కూడా లేకపోవడం మరింత అనుమానాలకు తావిచ్చింది. రోడ్డుపై విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆ వాహనంపై అనుమానం రావడంతో ఆపి ప్రశ్నించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే వాహనంలో ఉన్న యువకులు పోలీసులకు సరైన సమాధానం ఇవ్వకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో ఆ వాహనం నిజంగా పోలీసు శాఖకు చెందినదేనా? లేక ప్రైవేటు వ్యక్తులు పోలీసు గుర్తింపును దుర్వినియోగం చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**టూ వీలర్లపైనా పోలీసు స్టిక్కర్లు..**

కేవలం కార్లు, బొలెరోలకే పరిమితం కాకుండా కొన్ని ద్విచక్ర వాహనాలపై కూడా 'పోలీస్', పోలీసు గుర్తులు పోలిన స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. దీంతో రోడ్లపై తనిఖీలు నిర్వహించే సమయంలో ఇలాంటి వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

**సైరన్ పెట్టుకోవడం అంత ఈజీ కాదు..**

సాధారణ ప్రైవేటు వాహనాలకు పోలీసు వాహనాల్లో ఉపయోగించే ప్రత్యేక సైరన్ లేదా ఇతర శబ్ద పరికరాలను ఏర్పాటు చేసుకోవడం నిబంధనలకు విరుద్ధం. మోటారు వాహనాల నియమావలి ప్రకారం వాహనాలకు సైరన్ లు ఏర్పాటు చేయడంపై కొన్ని పరిమితులు ఉన్నాయి. పోలీసు వాహనాల్లోనూ అనుమతించబడిన వాహనాలకు మాత్రమే సైరన్లను ఉపయోగించాలి. అక్రమంగా సైరన్ వినియోగంపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి.

**నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు ..?**

వాహనానికి రిజిస్ట్రేషన్ గుర్తింపు తప్పనిసరి. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం మోటారు వాహన చట్టానికి విరుద్ధం. అలాంటి వారి పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం తో పాటు, జరిమానాలు విధించవచ్చు. దీంతో పాటు పోలీసు గుర్తింపును ఉపయోగించడం ద్వారా తాము పోలీసులమనే నమ్మకం కలిగించే ప్రయత్నం జరిగితే వారిని శిక్షించే అధికారం రవాణా శాఖ , పోలీసు అధికారులకు ఉంది. దీంతో ఒక వ్యక్తి పోలీసు అధికారిగా నటిస్తూ ఆ హోదా పేరుతో చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

**దుర్వినియోగంతో ఇబ్బందులు..**

పోలీసు స్టిక్కర్, సైరన్ వంటి గుర్తింపులు కేవలం హోదా ప్రదర్శన కోసం ఉపయోగించేవి కావు. అవి రోడ్లపై ఇతర వాహనదారులపై ప్రభావం చూపడంతో పాటు పోలీసు వాహనాలకు లభించే ప్రత్యేక ప్రాధాన్యతను దుర్వినియోగం చేసే అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో నిజమైన పోలీసు వాహనమని భావించి ఇతర వాహనదారులు మార్గం ఇవ్వడం, తనిఖీల సమయంలో ప్రత్యేక మినహాయింపులు కోరడం వంటి పరిణామాలకు ఇది దారితీయవచ్చు. అంతేకాకుండా, ఇలాంటి వాహనాలను నేరాలకు ఉపయోగిస్తే నిజమైన పోలీసు వాహనాలుగా కనిపించేలా చేయడం వల్ల దర్యాప్తు సంస్థలకు కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**తనిఖీలు అవసరం..**

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 'పోలీస్' స్టిక్కర్లు, పోలీసు గుర్తులు, సైరన్లు, అనుమానాస్పద లేదా నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. వాహనం నిజంగా పోలీసు శాఖకు చెందినదా? ప్రైవేటు వాహనమైతే పోలీసు స్టిక్కర్, సైరన్ ఎందుకు ఏర్పాటు చేసుకున్నారు? వాటిని ఎవరు ఏర్పాటు చేశారు? అనే అంశాలపై విచారణ జరిపితే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పోలీసు గుర్తింపు ప్రజల భద్రత కోసం.. వ్యక్తిగత దర్జా కోసం కాదు. పోలీసు పేరుతో ప్రైవేటు వాహనాల వినియోగంపై అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి దుర్వినియోగానికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

# విద్యా కేంద్రీకరణ విధానాలను విడనాడాలి

- ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలి
- టీఎస్ఈసీ రాష్ట్ర నాయకుడు మైస. శ్రీనివాసులు



**అక్షరశక్తి, మహబూబాబాద్:** రాష్ట్రంలో విద్యను కేంద్రీకృతం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే విడనాడాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (TSEC) రాష్ట్ర నాయకుడు మైస. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'తెలంగాణలో విద్యారంగ సంక్షోభం-సవాళ్లు-కర్తవ్యాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశానికి టీఎస్ఈసీ జిల్లా అధ్యక్షుడు బలాస్టి రమేష్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మైస. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు కోరని కొత్త విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తూ విద్యను కేంద్రీకృతం చేయడం సరైన విధానం కాదన్నారు. ఇది ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా వివిధ పేర్లతో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయడం కామన్ స్కూల్ విధానానికి వ్యతిరేకమన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించకుండా కొత్త పాఠశాలలు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితాలు రావన్నారు.

ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు విస్తృత ప్రజా ఉద్యమం అవసరమని శ్రీనివాసులు అన్నారు. విద్యా ప్రైవేటీకరణను అడ్డుకుని విద్యార్థులందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం విధానాలు రూపొందించాలని కోరారు. విద్యారంగంలోని అంతరాలను తొలగించేందుకు కామన్ స్కూల్ విధానమే సరైన పరిష్కారమని, దీనిని సాధించేందుకు బలమైన విద్యా ఉద్యమం అవసరమని స్పష్టం చేశారు. సమావేశంలో టీఎస్ఈసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లుట్ల, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు కొత్తపల్లి రవి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రాజు, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ బందెల రాజు, పీడీఎస్‌యూ నాయకులు బోనగిరి మధు, చైతన్య, మహేష్, ఎస్కే షబ్బీర్, పీటీఎఫ్ మహబూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శి సి. రామలింగారెడ్డి, టీపీటీఎఫ్ నాయకులు ప్రకాష్, లక్ష్మయ్య, భీముడు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన గిరిజన మహిళ




**అక్షరశక్తి, వరంగల్:** మారుమూల గిరిజన వాడలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి డాక్టరేట్ సాధించిన కుసునోత్ మంజుల విజయగాథ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. పేదరికం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొంటూనే ఆమె ఉన్నత విద్యను కొనసాగించారు. తండ్రి యాకుబ్ రోజువారీ కూలీగా పనిచేయగా, తల్లి బుజ్జి కుటుంబాన్ని నడిపించారు. చిన్నతనం నుంచే ఇంటి పనులు, నీళ్లు మోయడం, తమ్ముళ్లు, చెల్లెళ్లను చూసుకోవడంతోపాటు చదువుపై మంజుల దృష్టి సారించారు. పుస్తకాలు కొనలేని పరిస్థితుల్లో అప్పుగా తెచ్చుకున్న పుస్తకాలు, పాత నోట్సులతో చదువుకున్నారు. వివాహానంతరం కూడా చదువును కొనసాగించిన ఆమెకు భర్త భాస్కర్ ప్రోత్సాహం అందించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో గిరిజన మహిళల పాత్ర ఎందుకు చరిత్రలో కనుమరుగైందన్న ప్రశ్న ఆమెను పరిశోధన వైపు నడిపించింది. "తెలంగాణ సాయుధ పోరాటం (1946-1951)లో గిరిజన మహిళల పాత్ర" అనే అంశంపై పరిశోధన చేశారు. మారుమూల గ్రామాలకు వెళ్లి వృద్ధుల జ్ఞాపకాలు, పాత రికార్డులు సేకరించడంతోపాటు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ (రిటైర్డ్) ఆమెకు మార్గదర్శకత్వం అందించారు. ఎన్నో ఏళ్ల శ్రమ అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం నుంచి మంజుల పీహెచ్‌డీ సాధించారు. దేవురుప్పాల మండలం నుంచి గిరిజన మహిళల్లో డాక్టరేట్ సాధించిన తొలి మహిళగా నిలిచారు. ఈ విజయం గిరిజన మహిళలకు స్ఫూర్తిగా నిలిచిందని మంజుల పేర్కొన్నారు. తన పరిశోధన ద్వారా గిరిజన మహిళల చరిత్రకు న్యాయం చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## సాయుధ పోరాట స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి**



**అక్షరశక్తి, హసన్‌పర్తి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ నిజాం పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన సాయుధ రైతాంగ పోరాటం చారిత్రాత్మకమన్నారు. బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్, నల్లా నరసింహులు, రావి నారాయణరెడ్డి వంటి నాయకుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు. రైతు ఉద్యమాలు, ప్రజా ఉద్యమాలు ప్రజల్లో పెరుగుతున్న నిరసనకు నిదర్శనమన్నారు. సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పరిరక్షణకు మరో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐయూఈసీ జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా ఖదీర్‌ఖాన్



**అక్షరశక్తి, హన్మకొండ:** ఆల్ ఇండియా యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ (AIUEC) జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌జీవో ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ప్రెసిడెంట్ అబ్దుల్ ఖదీర్‌ఖాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ నాన్ గెజిటెడ్ ఉద్యోగ సంఘాల నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న 'హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' జాతీయ సదస్సులో ఖదీర్‌ఖాన్ నియామకం జరిగింది. కేయూ ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు బూర నవీన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ యూనస్, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, కోశాధికారి తాటి దామోదర్, కార్యదర్శులు సతీష్‌బాబు, ప్రభాకర్, కృష్ణవేణి తదితరులు ఆయనను సన్మానించారు.



# సిరివెన్నెల కుటుంబానికి సేవా సమితి సాయం

**అక్షరశక్తి,నల్లబెల్లి:** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో ఇటీవల షార్ట్‌సర్క్యూట్ కారణంగా మృతి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి పిట్టల సిరివెన్నెల కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి అండగా నిలిచింది. ఓరుగంటి తిరుపతి ముదిరాజ్ సూచన మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు పెసరు రాజన్న ఆదేశాలతో దాతల సహకారంతో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్, పోలుదాసరి రమేష్, ఎలబోయిన రాజు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కుల పెద్దలు పాండవుల రాంబాబు, గోనెల నరహరి, గ్రామ సర్పంచ్ ప్రకాష్ సమక్షంలో ఈ సాయం అందించారు. అనంతరం చిన్నారి సిరివెన్నెల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ద్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెసరు రాజన్న, నాయకులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్ ముదిరాజ్ సేవా సమితి జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సహకారం అందించడమే సమితి లక్ష్యమన్నారు. సిరివెన్నెల కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలిపిన ఓరుగంటి తిరుపతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పులి సదానందం, సింగారపు రామకృష్ణ, ఆకుల సుభాష్, వాసు శ్రీనివాస్, అమ్మగారి శ్యామ్, ముద్రబోయిన రమేష్, పొన్నం రాజు, జటబోయిన శివ, దండు చిరంజీవి, రామస్వామి, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యం ఆరోగ్యంపై కొండా సురేఖ ఆరా

- ఆసుపత్రికి వెళ్లి పరామర్శ..
- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన



**అక్షరశక్తి, వరంగల్:** మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి నార్ల సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో కొండా సురేఖ మాట్లాడి సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. అవసరమైన మెరుగైన వైద్యం అందించి ఆయన త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. సుబ్రహ్మణ్యం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కొండా సురేఖ ఆకాంక్షించారు.

# 6, 17న కోయల కొత్తల పండుగ



**అక్షరశక్తి, గూడూరు:** ఆదివాసీ కోయల సంప్రదాయ పండుగల్లో ప్రత్యేకమైన కొత్తల పండుగను ఈ నెల 16, 17 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా కోయగూడాల్లో నిర్వహించుకోవాలని మేడారం పగిడిద్దరాజు పూజారి పెనుక ప్రభాకర్ సూచించారు. కోయల పండుగలు వారి జీవనశైలిని ప్రతిబింబించేలా సాంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. ఉత్తర కార్తె మొదటి పాదంలో సెప్టెంబరులో వచ్చే కొత్తల పండుగను 'పెద్దల పండుగ'గా కూడా పిలుస్తారని పేర్కొన్నారు. ప్రతి కోయగూడంలో ఈ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

# పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్




**అక్షరశక్తి, మహబూబాబాద్:** రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో జరిగే అఖిలభారత రైతు మహాసభలు ఈ డిమాండ్‌కు వేదిక కానున్నాయని తెలిపారు. శనివారం సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లోని నీలకుర్తి సీతారాం రెడ్డి ప్రాంగణంలో తెలంగాణ రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా మహాసభలు గుణగంటి రాజన్న, నంబూరి మధు అధ్యక్షతన జరిగాయి. రైతు సంఘం పతాకాన్ని సీనియర్ నాయకుడు మార్తినేని పాపారావు ఆవిష్కరించారు. మహాసభ ప్రారంభ సభలో సుదర్శన్ మాట్లాడుతూ ఇటీవల భారత్-అమెరికా మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వానికి విఘాతం కలిగించేలా ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం రైతు సంఘం నిరంతర ఉద్యమాలు కొనసాగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రైతు సంఘం కీలక పాత్ర పోషించిందని, 440 రైతు సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని బలోపేతం చేసిందని తెలిపారు. ఈ పోరాటంలో 756 మంది రైతులు మృతిచెందారని, దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఉద్యమ విరమణ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. నవంబర్ 15న నల్గొండలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సుదర్శన్ తెలిపారు. మహాసభల విజయానికి మహబూబాబాద్ జిల్లా రైతాంగం సహకరించి రైతు ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. జిల్లా కార్యక్రమాల వివరాలను కార్యదర్శి శెట్టి వెంకన్న ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాదుల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, నల్లపు సుధాకర్, గడ్డిపాటి రాజారావు, బొబ్బల యాకోబు రెడ్డి, బొల్లం అశోక్, బొబ్బ వెంకట్‌రెడ్డి, జక్కుల మల్లయ్య, దుడ్డేల రామమూర్తి, నక్క సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయానికి రేవంత్ ప్రభుత్వం పెద్దపీట

**అక్షరశక్తి హనుమకొండ:** తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలు అభినందనీయమని ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ రాష్ట్ర సలహాదారుడు, ప్రభుత్వ పాలిటెక్నిక్ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు ఇ.వి. శ్రీనివాస్‌రావు అన్నారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు నెలవారీ పెన్షన్ అందించాలనే నిర్ణయం మానవతా దృక్పథంతో కూడుకున్నదని, దీర్ఘకాలిక చికిత్స అవసరమయ్యే కుటుంబాలకు ఇది ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, విద్యార్థులు, సిబ్బంది, సాంకేతిక విద్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని GO97లో అవసరమైన మార్పులకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం స్వాగతించదగిన పరిణామమని శ్రీనివాస్‌రావు తెలిపారు. అదేవిధంగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే చర్య స్థానిక పాలనలో సమాన ప్రాతినిధ్యానికి, సామాజిక సమగ్రతకు ముందడుగు అని అన్నారు. ఈ మూడు అంశాల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించేందుకు సహకరించిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఇ.వి. శ్రీనివాస్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం అభినందనీయమని, సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగడం సంతోషకరమని పేర్కొన్నారు.





# చలగంటి సాత్విక్ కుటుంబానికి అండగా నిలబడిన ఎంజేపీ గురుకులాల కార్యదర్శి సైదులు

**అక్షరశక్తి, ఖమ్మం:** జిల్లాలోని రఘునాథపాలెం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చలిగంటి సాత్విక్ నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షులు శనిగరపు రాజేంద్రప్రసాద్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ సాత్విక్ కుటుంబ సభ్యులను పరామర్శించి విద్యార్థి సంఘాల తరఫున తమ వంతుగా ఆ కుటుంబానికి బాసటక నిలబడేందుకు క్వింటాల్ బియ్యం అందించారు. అనంతరం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఎంజేపీ గురుకులాల సెక్రటరీ సైదులుతో ఫోన్లో మాట్లాడిస్తూ సాత్విక్ తల్లి ,తండ్రి మాట్లాడుతూ ఇంకో కుమారుడు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని, ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు సాత్విక్ మృతిచెందగా, చిన్న కుమారుడు మూగవాడని తెలిపారు. చిన్న కుమారుడి వైద్య ఖర్చుల కోసం తల్లి హైదరాబాద్‌లో ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు చెప్పారు. వెంటనే సైదులు జిల్లా అధికారుల ద్వారా వారి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సొసైటీ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించాలని సెక్రటరీ సైదులు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు గురుకుల సిబ్బంది ఇవాళ సాత్విక్ కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అలాగే హైదరాబాద్ పరిసర ప్రాంతంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో సాత్విక్ తల్లికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని సైదులు హామీ ఇచ్చారు. కుటుంబానికి అండగా నిలిచిన సెక్రటరీ సైదులకు స్వేరోస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



# గణేశ్ ఉత్సవాలపై నిత్యం నిఘా

- ముస్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- నిమజ్జనానికి చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటుకు సీఎం ఆదేశం





**అక్షరశక్తి, హైదరాబాద్:** మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం సమీక్షించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా జరిగేందుకు నిర్వాహకులు పోలీసు, మున్సిపల్ శాఖలకు సహకరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని సీఎం పేర్కొన్నారు. నిర్వాహకుల సమస్యలను తెలుసుకునేందుకే స్వయంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించే సందర్భంలో వారి వివరాలను స్థానిక కమిషనరేట్‌కు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ముందస్తు సమాచారం ఉంటే అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు అనుకోని ఘటనలు జరిగినప్పుడు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని పొందాలని సూచించారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే పోలీసులకు సమాచారం అందిస్తే ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణ సులభమవుతుందని అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాట్లు చేసినట్టే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం సాఫీగా సాగేందుకు చెరువుల చుట్టూ క్రేన్లను ఏర్పాటు చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, హైడ్రా కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈనెల 15న జరిగే హమాలీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి




- ఐఎఫ్టియు నేతలు రాజేందర్, బండి కుమార్
- ఎనుమాముల మార్కెట్ వద్ద పోస్టర్స్ ఆవిష్కరణ

**అక్షరశక్తి, వరంగల్ :** అసంఘటితరంగ హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం వెంటనే చేయాలని అమాలి కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రతి కార్మికుడి పేరును అందులో నమోదు చేయాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి నెలకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ప్రతి కార్మికుడికి ఈపీఎఫ్ ఈఎస్ఐ గ్రూపు ఇన్సూరెన్స్ ప్రమాద బీమా తప్పనిసరిగా అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఈ నెల 15న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాల్సినటువంటి బాధ్యత ప్రతి హమాలీ కార్మికులపై ఉందని ఐఎఫ్టియు నేతలు రాజేందర్, బండి కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎనుమాముల మార్కెట్ వద్ద వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిరక్షించాల్సింది పోయి కార్మికుల వ్యతిరేక నాలుగు లేబర్ కోడులు అమలు చేసి దశాబ్దాలుగా కార్మికులు పోరాడు సాధించుకున్న అనేక హక్కులను బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితి మారాలంటే హమాలీ కార్మికులు సంఘటితమై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కానుగుల రంజిత్, హమాలీ సంఘం నాయకులు బండి సాంబయ్య, చేరాలు, భాస్కర్, కమలాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఓర్సు సుధాకర్, ఎడ్ల రవి, జక్కుల రమేష్, వాసు తిరుపతి, పోతరాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట అమరులకు ఘన నివాళి




**అక్షరశక్తి, చిల్పూర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ శాఖ కార్యదర్శి ఆవుల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత ప్రజల ఐక్యతకు, నిరంకుశత్వ వ్యతిరేక పోరాటానికి తెలంగాణ రైతాంగ ఉద్యమం ప్రతీకగా నిలిచిందన్నారు. నిజాం నిరంకుశ పాలన, ఫ్యూడల్ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో మహత్తర ఘట్టమని పేర్కొన్నారు. 'దున్నేవానికే భూమి', 'భూమి, భుక్తి, విముక్తి' నినాదాలతో సాగిన పోరాటంలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాల సాధనకు కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం మాజీ సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులు మోతె వెంకటయ్య, సాందోజు వెంకటాచారిలను శాలువాతో సన్మానించి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేయూ ఈఈఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా డాక్టర్ వి. రాము



**అక్షరశక్తి, హన్మకొండ:** కాకతీయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా కొత్తగూడెం యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ వి. రాము నియమితులయ్యారు. కేయూ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం మూడేళ్లపాటు అమల్లో ఉంటుంది. డాక్టర్ వి. రాము ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు డాక్టర్ కే. సుమలత నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

## ఆదర్శ కాలనీలో మట్టి గణపతుల పంపిణీ




**అక్షరశక్తి, హనుమకొండ:** 53వ డివిజన్ ఆదర్శ కాలనీలో కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో, ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి కాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. సదాసయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఆదర్శ కాలనీ పర్యావరణ పరిరక్షణతో పాటు అవయవదాన ఉద్యమంలోనూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కేబీ ధర్మప్రకాష్, ఉమామహేశ్వరరావు, తూడి విద్యాసాగర్‌రెడ్డి, పరికిపండ్ల వేణు, కిషోర్‌గాంధీ, ఆడెపు రమణయ్య, జయమ్మ, శోభారాణి, సందీప్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# డాలర్లతో ప్రజాస్వామ్యాన్ని కొంటారా!?




- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

ప్రజాస్వామ్యాన్ని ప్రపంచానికి బోధించే అమెరికా రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న $5,000 హామీ కేవలం ఒక ఎన్నికల వాగ్దానం కాదు. అది ఓటరు గౌరవం, రాజకీయ నైతికత, ప్రభుత్వ ఆర్థిక బాధ్యత. ఈ మూడింటినీ ఒకేసారి ప్రశ్నార్థకం చేస్తున్న పరిణామం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల రిపబ్లికన్ పార్టీ నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో ప్రతినిధుల సభ, సెనెట్ రెండింటినీ నిలబెట్టుకుంటే ప్రతి వయోజన అమెరికన్ పౌరుడికి $5,000 "ట్రంప్ డివిడెండ్" ఇస్తానని ప్రకటించారు.

ఇక్కడ అసలు అభ్యంతరం ప్రజలకు డబ్బు ఇవ్వడంలో లేదు. సంక్షోభకాలంలో అమెరికా ప్రభుత్వం కూడా పౌరులకు ప్రత్యక్ష నగదు సహాయం చేసిన సందర్భాలున్నాయి. ప్రశ్న ఏమిటంటే, ఒక ఎన్నికల ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ ఖజానా నుంచి వచ్చే భారీ మొత్తాన్ని రాజకీయ విజయంతో ముడిపెట్టడం ఎంతవరకు ప్రజాస్వామ్యబద్ధం? "రిపబ్లికన్లు గెలిస్తే మీరు గెలుస్తారు, మీకు $5,000 వస్తుంది" అనే రాజకీయ సందేశం ఓటరును విధానాల ఆధారంగా నిర్ణయం తీసుకునే పౌరుడిగా చూస్తుందా, లేక ఆర్థిక ప్రయోజనం కోసం ఆకర్షించాల్సిన వినియోగదారుడిగా చూస్తుందా?

ట్రంప్ ఈ మొత్తాన్ని "డివిడెండ్" అని పిలవడం కూడా రాజకీయ మార్కెటింగ్‌కు అద్భుతమైన ఉదాహరణ. డివిడెండ్ అంటే సాధారణంగా లాభం పొందిన సంస్థ తన వాటాదారులకు పంచే ఆదాయం. వైట్ హౌస్ కూడా ఇదే ఉపమానాన్ని ఉపయోగించింది. అమెరికా విజయవంతమైన కంపెనీ అయితే, దాని "షేర్‌హోల్డర్లు" అయిన అమెరికన్లకు నగదు పంచుతున్నామనే వాదన చేసింది. కానీ దేశం కంపెనీ కాదు; పౌరులు షేర్‌హోల్డర్లు కాదు.అమెరికా అధ్యక్షుడు కార్పొరేట్ సీఈఓ కాదు. రాజ్యాన్ని వ్యాపార సంస్థగా, పౌరులను వినియోగదారులుగా, ఎన్నికలను పెట్టుబడి నిర్ణయంగా చూడటం ప్రజాస్వామ్య స్వభావాన్నే వక్రీకరిస్తుంది.

అంతకంటే తీవ్రమైన ప్రశ్న ఈ హామీకి ఉన్న లెక్కల్లో ఉంది. అమెరికాలో సుమారు 240–250 మిలియన్ల వయోజన పౌరులకు ఒక్కొక్కరికి $5,000 చెల్లించాలంటే సుమారు $1.2–$1.25 ట్రిలియన్ అవసరం. ఇది చిన్న సంక్షేమ పథకం కాదు. 2027 ఆర్థిక



సంవత్సరానికి అమెరికా ఫెడరల్ బడ్జెట్ లోటు దాదాపు $1.9 ట్రిలియన్‌గా అంచనా వేయబడుతున్న సమయంలో, మరో ట్రిలియన్ డాలర్‌కు పైగా ఖర్చును ఎలా భరిస్తారన్నదే అసలు ప్రశ్న.

ట్రంప్, ఆయన మద్దతుదారులు టారిఫ్ ఆదాయాన్ని ఈ పథకానికి ఆధారంగా చూపుతున్నారు. కానీ ఇక్కడే రాజకీయ ప్రచారం, ఆర్థిక వాస్తవం మధ్య అంతరం బయటపడుతోంది. ఫ్యాక్ట్‌చెక్ విశ్లేషణల ప్రకారం 2025లో అమెరికా నికర టారిఫ్ ఆదాయం సుమారు $264 బిలియన్లు; 2026లో కోర్టు తీర్పులతో చెల్లించిన రీఫండ్లు పరిగణనలోకి తీసుకుంటే జూలై వరకు నికర ఆదాయం సుమారు $64 బిలియన్లే. $1.2 ట్రిలియన్ చెల్లింపును టారిఫ్ ఆదాయంతోనే భరించాలంటే ప్రస్తుత స్థాయిలతో అనేక సంవత్సరాలు పడుతుంది.

అంటే "ట్రిలియన్ల టారిఫ్ ఆదాయం వచ్చింది" అని చెప్పడం ఒకటి; వాస్తవంగా ప్రభుత్వ ఖజానాలో అందుబాటులో ఉన్న నికర ఆదాయం ఎంత అన్నది మరొకటి. ప్రజలకు $5,000 చూపించడం సులభం. కానీ ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది, ఎంత కొత్త అప్పు చేయాలి, వడ్డీ భారం ఎంత పెరుగుతుంది, ద్రవ్యోల్బణంపై ప్రభావం ఏమిటి అన్నవి చెప్పడం అంత ఆకర్షణీయమైన ఎన్నికల ప్రసంగం కాదు. అందుకే రాజకీయ నినాదం ముందు వస్తోంది, ఆర్థిక లెక్కలు వెనుకబడుతున్నాయి.

ఇది అమెరికా ఓటరును తక్కువ అంచనా వేసే రాజకీయ దృక్పథం కూడా. అమెరికా పౌరుడు ఒక చెక్కు కోసం తన ఓటును అమ్ముకునే వ్యక్తి కాదని గుర్తుంచుకోవాలి. ఓటరు ఉద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్యం, పన్నులు, విద్య, విదేశాంగ విధానం, ప్రజాస్వామ్య సంస్థలు, న్యాయవ్యవస్థ వంటి అనేక అంశాలపై నిర్ణయం తీసుకుంటాడు. అతని ఓటును $5,000తో ఆకర్షించవచ్చని భావించడం వాస్తవానికి ఓటరిని అవమానించడమే. ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులను ఎంతగా తక్కువ చేసి మాట్లాడినా, అమెరికా పౌర సమాజం మొత్తాన్ని డాలర్లతో కొలవడం మాత్రం మరింత దిగజారిన రాజకీయ సందేశం.

ఇక్కడ ట్రంప్ వ్యక్తిగత రాజకీయ శైలిలోని వ్యాపార దృష్టి కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనకు రాజకీయ విజయాన్ని కూడా ఒక బిజినెస్ డీల్‌లా చూపించడం అలవాటే "మేము గెలిస్తే మీకు లాభం." కానీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం లాభం పంచే కంపెనీ కాదు. పౌరుల హక్కులు, పన్నులు, ప్రజా వనరులు, రాజ్యాంగ సంస్థలు, ఇవి ఏ అధ్యక్షుడి వ్యక్తిగత ఆస్తులు కావు. ప్రభుత్వ ఖజానా అధ్యక్షుడి జేబు కాదు; అది ప్రజల డబ్బు. దాన్ని ఎన్నికల విజయానికి ప్రతిఫలంగా చూపించడం రాజకీయ అధికారాన్ని వ్యక్తిగత బ్రాండ్‌గా మార్చే ప్రమాదకర ధోరణి.

అమెరికా ఎన్నికల్లో డబ్బు ప్రభావం కొత్తది కాదు. ఎన్నికల ప్రచారాలకు భారీ విరాళాలు, సంపన్నుల ప్రభావం, లాబీయింగ్, కార్పొరేట్ నిధులు దశాబ్దాలుగా చర్చనీయాంశాలే. కానీ ఆ సమస్యకు పరిష్కారం సాధారణ ఓటరుతో కూడా "నగదు లావాదేవీ" రాజకీయాన్ని పెంచడం కాదు. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని తగ్గించాల్సిన దేశం, ఓటరు భవిష్యత్తును నగదు హామీలతో కొలిచే రాజకీయ భాషను సాధారణీకరిస్తే అది ప్రజాస్వామ్య సంస్కృతికి మరింత నష్టం చేస్తుంది.

అయితే ఇక్కడ మరో ముఖ్యమైన తేడాను గుర్తించాలి. ట్రంప్ ప్రతిపాదనను చట్టపరంగా నేరుగా "ఓటుకు లంచం"గా పిలవడం సరికాదు. ఎందుకంటే ప్రకటించిన షరతు "రిపబ్లికన్ పార్టీకి మీరు ఓటేస్తే $5,000" అన్నది కాదు; రిపబ్లికన్లు రెండు సభల్లో మెజారిటీ నిలబెట్టుకుంటే చెల్లిస్తానన్నది. చట్టపరమైన నిర్వచనం ఒక విషయం; ప్రజాస్వామ్య నైతికత మరో విషయం. ఎన్నికల ఫలితాన్ని నగదు ప్రయోజనంతో ముడిపెట్టడం వల్ల రాజకీయ సంభాషణ విధానాల నుంచి డబ్బు వైపు మళ్లే ప్రమాదమే అసలు ఆందోళన.

అమెరికా నిజంగా "ప్రపంచ ప్రజాస్వామ్యానికి పెద్దన్న"గా నిలవాలంటే తన పౌరులను డాలర్లతో ఆకర్షించాల్సిన అవసరం ఉండకూడదు. మంచి పాలన ఉంటే దానికి లెక్కలు చూపాలి. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే దాని ఫలితాలను ఉద్యోగాలు, వేతనాలు, ప్రజా సేవలు, సామాజిక భద్రత రూపంలో చూపాలి. టారిఫ్‌లు ఆదాయం తెస్తే దాని ఖచ్చితమైన లెక్కలు చెప్పాలి. బడ్జెట్‌లో డబ్బు ఉంటే దాని వినియోగానికి చట్టబద్ధమైన ప్రక్రియ పాటించాలి. అంతే కానీ "మేము గెలిస్తే మీకు $5,000" అనే ఎన్నికల మార్కెటింగ్‌కు దిగడం అమెరికా ప్రజాస్వామ్య సంప్రదాయానికి గౌరవం కాదు.

ట్రంప్ రాజకీయాలను వ్యాపార ఒప్పందాల భాషలోకి తీసుకురావచ్చు. కానీ అమెరికా ఓటరు తప్పనిసరిగా ఆ ఒప్పందానికి సంతకం చేయాల్సిన వినియోగదారు కాదు. అతను సార్వభౌమాధికారానికి యజమాని. అతని ఓటుకు మార్కెట్ ధర లేదు. $5,000 కావచ్చు, $50,000 కావచ్చు. ఓటు విలువను డాలర్లలో కొలవడం ప్రారంభమైన క్షణంలో ఓడిపోయేది ప్రత్యర్థి పార్టీ కాదు; ప్రజాస్వామ్యమే.

అందుకే ఈ వివాదాన్ని "ఎవరికి $5,000 వస్తుంది?" అనే ప్రశ్నకు పరిమితం చేయకూడదు. అసలు ప్రశ్న "అమెరికా ఓటరిని ఎంత విలువైన పౌరుడిగా చూస్తున్నాం?" అన్నది. ట్రంప్ ఒక ఎన్నిక గెలిపించుకోవడానికి డాలర్లను రాజకీయ ఆకర్షణగా చూపవచ్చు. కానీ అమెరికా పౌరుల మేధస్సును, వారి రాజకీయ విచక్షణను, వారి ప్రజాస్వామ్య నైతికతను అంత తక్కువ ధరకు అంచనా వేయడం మాత్రం ఆయన ప్రకటనలోని అత్యంత అవమానకరమైన అంశం. ప్రజాస్వామ్యానికి బలం ఖజానాలోని డాలర్లలో ఉండదు; ఓటరుకు తన నిర్ణయంపై ఉన్న స్వేచ్ఛలో ఉంటుంది. ఆ స్వేచ్ఛకు ధర కట్టే రాజకీయ నాయకుడు ఎంత శక్తిమంతుడైనా, ప్రజాస్వామ్య విలువల ముందు మాత్రం చిన్నవాడే.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.